క్లుప్తంగా

భగవద్గీతపై ప్రచారం



ప్రచార కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు

వి.కోట: మండల ప్రబోధ సేవా సమితి సభ్యులు, జ్ఞాన వేదిక కుప్పం కమిటీ సభ్యులు ఆదివారం మండలంలో భగవద్గీతపై ప్రచారం చేశారు. సుద్దులకుప్పం, ఎస్ బండ పల్లె త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు భగద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సభ్యులు కృష్ణ, ప్రకాష్, శరవణ, కృష్ణమూర్తి, లోకేష్, మైత్రి, వెంకటలక్ష్మి, జలజాక్షి, వాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయరూ!

–ఎమ్మెల్యేను కోరిన గ్రామస్తులు



ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి రోడ్డు సమస్యలను నివేదిస్తున్న గ్రామస్తులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె నుంచి నెల్లిపట్లకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉందని, దీనిని బాగు చేయాలని ఆ గ్రామాల ప్రజలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కోరారు. దుగ్గినవారిపల్లెలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు నివేదించారు. ఈ మార్గంలో జల్లిలోడ్లు వెళ్లి రోడ్డు మొత్తం గులకరాళ్లతో నిండిపోయిందన్నారు. ఎటు చూసినా గుంతలమయం కావడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదం జరిగితే 108 అంబులెన్సు కూడా సకాలంలో రాని పరిస్థితి నెలకొని ఉందని పేర్కొన్నారు.

నిశ్చితార్థం..ఆశీర్వాదం



నిశ్చితార్థ వేడుకల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చెరువు ముందరపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎ.రామచంద్రారెడ్డి మనవరాలు పూర్ణిమ, వరుడు మురళీరెడ్డి ల నిశ్చితార్థ వేడుకల్లో పుంగనూరు మ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వి.కోట కవులకు సన్మానం



కొఠారి వెంకటరత్నంను సన్మానిస్తున్న ప్రముఖులు కవులు

వి.కోట: జిల్లా కేంద్రంలోని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు తేజాలకు కళాభిషేకం అనే కార్యక్రమం నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి.కోట మండలానికి చెందిన డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారి, డాక్టర్ రఘుపతిని ఘనంగా సన్మానించారు.

కొందరికే వందనం..!

- తల్లులకు తప్పని ఎగనామం
- రూ.15వేలకు బదులు రూ.13 వేలే..!
- దీనికి కూడా ఎన్నో కొర్రీలు



తల్లికి వందనంలోనూ కోతలే

పలమనేరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరుస్తారంటే తల్లిదండ్రులకు పిల్లల చదువులకు సంబంధించి ఏ టెన్షనూ ఉండేది కాదు. నిశ్చింతగా ఉండేవాళ్లు. పిల్లలకు యూనిఫాం, షూలు, పుస్తకాలు, నోట్సులు, ఫీజుల కోసం తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఇంటర్మీడియెట్ వరకూ చదివే విద్యార్థుల తల్లులకు ప్రతి ఏటా రూ.15వేల సాయం ప్రభుత్వం నుంచి అందేది. కూటమి ప్రభుత్వ పాలనలో తల్లులకు ఆందోళన తప్పడం లేదు. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పేరిట రూ.15వేల చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తలేదు. ఏడాది గడచిపోయింది. ఇప్పుడు ఇస్తామని ప్రకటించి ఇచ్చే డబ్బులో రూ.2వేలు కోత పెట్టింది.

'తల్లికి వందనం'లో ఎన్నో కొర్రీలు

ఎలాగైనా లబ్ధిదారులను తగ్గించాలని కూటమి సర్కార్ ఈ పథకంలో ఎన్నో నిబంధనలు తీసుకువచ్చింది. కుటుంబ ఆదాయం గ్రామాల్లో ఏడాదికి రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44లక్షలుగా నిర్ణయించింది. కుటుంబానికి మూడెకరాల్లోపు మాగాణి లేదా పదెకరాల్లోపు డీకేటి, కరెంట్ బిల్లు ఏడాదిలో 300 యూనిట్లకు తక్కువగా ఉండాలి, విద్యార్థుల హాజరు శాతం 75శాతానికి తక్కువగా ఉండరాదు, సర్పంచ్‌ల పిల్లలు కూడా అనర్హులని ప్రకటించడంతో మండిపడుతున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగులు సైతం నిబంధనల పేరిట తమ పిల్లలకు కూడా కొర్రీలు పెట్టిందని ప్రభుత్వం తీరును తప్పుపడుతున్నారు. కార్లు, ట్రాక్టర్లు ఉన్న వారు అనర్హులని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది.



గతంలో లోకేష్ చెప్పిన మాటల క్లిప్పింగ్

నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	:	469
అమ్మ ఒడి కింద గత ప్రభుత్వంలో లబ్ధిపొందిన వారు	:	40,100
ఇందుకోసం అప్పట్లో పొందిన నగదు	:	రూ.165.19 కోట్లు
కూటమి ప్రభుత్వంలో లబ్ధి పొందేవారు	:	కేవలం 32 వేలమందే
వీరికి కేటాయింపు	:	రూ. 44 కోట్ల వరకు


ఇప్పుడు ఎవరిని సైకో అనాలి?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి నుంచి పాఠశాల అభివృద్ధి కోసం రూ.వెయ్యి మినహాయించి జగన్‌మోహన్‌రెడ్డిని ఇస్తే సీఎం అనే గౌరవం కూడా లేకుండా అదే పనిగా సైకో అంటూ నారా లోకేష్ బురద చల్లారు. ఇప్పుడు కూటమి పాలనలో రెండు వేలు కట్ చేసి ఇచ్చారే..! మరి వీళ్లనేమనాలి? ప్రజలను మోసం చేస్తున్నదెవరో అందరికీ అర్థమైంది.

-వెంకటేగౌడ,
మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

నాడు విమర్శించి ఇప్పుడు మీరు చేసిందేమిటి?



గత ప్రభుత్వంలో అమ్మ ఒడికి సంబంధించి బడి అభివృద్ధి కోసం రూ.వెయ్యి తగ్గిస్తే జగన్ మోహన్‌రెడ్డి మోసం చేశారని లోకేష్ విమర్శించారు. అదే ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.15 వేలకు బదులు రూ.13వేలే ఇస్తామని ప్రకటించింది. ఇప్పుడు వీరినేమనాలి? అంటే మీరు ఏమి చేసినా అది కరెక్ట్ వేరేవాళ్లు ఏంచేసినా అది తప్పంటే ఎలా?

-శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్,
ఉమ్మడి చిత్తూరు జిల్లా

ఎప్పుడు వస్తుందో తెలియదు



నాకు ఇద్దరు ఆడపిల్లలు. నేను, నా భర్త కూలీపనులపై ఆధారపడి పిల్లలను చదివిస్తున్నాం. గతంలో అమ్మ ఒడి రావడంతో ఏ బాధల్లేకుండా చదువులు బాగా సాగాయి. ఇప్పుడు మా పెద్దపాప ఇంటర్. రెండో అమ్మాయి కొత్తపల్లి హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదవతాంది. తల్లికి వందనం ఇస్తామంటున్నారు. కానీ ఎప్పుడు వస్తుందో ఇంకా తెలియడం లేదు. అదీ ఈ దఫా 13వేలేనని చెబుతున్నారు.

--రుక్మిణి, కొత్తపల్లె దళితవాడ, గంగవరం మండలం

ముగ్గురికి ఇస్తే మేలే..!



నాకు ముగ్గురు పిల్లలు. ఏమీ లేకున్నా పిల్లలను బాగా చదివించాలన్నదే నా ఆశ. పెద్దకుమార్తె సుప్రియ ఆరో తరగతి, రెండో అబ్బాయి ఉమేష్ ఐదో తరగతి, మూడో అబ్బాయి మహేష్ రెండో క్లాస్ చదువుతున్నారు. ముందు ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం పిల్లల చదువులకు మేలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చింది. తల్లికి వందనం అని ప్రకటించింది. మా ఇంట్లో ముగ్గురికి పిల్లలకు రావాలి. ఎప్పుడిస్తారో ఎంతమందికిస్తారో తెలియడం లేదు.

-కస్తూరి, వీ.కోట

'తల్లికి వందనం'తో మోసం చేశారు



కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసింది. ఎన్నికల సమయంలో కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం డబ్బులు ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో లేని పోని కండిషన్లు పెట్టి దగా చేశారు. 300 యూనిట్ల పైచిలుకు కరెంటు బిల్లు వస్తే లేదని, నాలుగు చక్రాల వాహనం ఉంటే లేదని కండిషన్లు పెట్టి తల్లికి వందనంలో కోతలు పెట్టారు. చంద్రబాబు నాయుడు హామీలను ఏరోజూ పూర్తిస్థాయిలో నెరవేర్చిన దాఖలాలు లేవు.

- పూజితా రెడ్డి , విద్యార్థి యూనియన్ నాయకురాలు, రొంపిచెర్ల మండలం

వందనం కాదు..నిబంధనల పేరిట పంగనామం



నా కుమారుడు భార్గవ చౌదరి, కుమార్తె లాస్య చౌదరి చదువుతున్నారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకంలో నా కుమార్తెకు ఆర్థిక సాయం ఐదేళ్లూ వచ్చింది. 300 యూనిట్ల పైన కరెంటు బిల్లు వచ్చే వారికి తల్లికి వందనం ఇచ్చేది లేదని కూటమి ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. ఎన్నికల సమయంలో మాత్రం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని ఇప్పుడేమో నిబంధనల పేరిట పంగనామాలు పెడుతోంది. మాకూ నిలిపివేసింది. వీళ్లైనంత మందికి ఆర్థిక సాయం ఇవ్వకుండా ఉండేందుకు ఇలా చేయడం సరికాదు.

-అమ్మినేని అనిత , బోడిపాటివారిపల్లె, రొంపిచెర్ల మండలం

సీనియర్ సిటిజన్స్‌ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

- తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదే
- పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: సీనియర్ సిటిజన్స్‌ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని, వృద్ధుల సమస్యల కోసమే ప్రత్యేక చట్టాలున్నాయని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత అన్నారు. ఆదివారం పట్టణంలోని పీపీఎస్(పలమనేరు పరిరక్షణ సమితి) కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, 2007లో కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ కోసం రక్షణ చట్టాన్ని తెచ్చిందన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ఆస్తి రాయించుకుని ఆపై తల్లిదండ్రులను పట్టించుకోకుంటే కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. తల్లిదండ్రుల పోషణ, వైద్యసేవలు, నివాస సౌకర్యాల కల్పించాల్సిన బాధ్యత వారి బిడ్డలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ భాస్కర్, ఎస్‌ఐ స్వర్ణతేజ, పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు, ఆనంద్‌బాబు, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో కార్డన్ సెర్చ్

బంగారుపాళెం: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వెలుతురు చేను, సీజే ఎస్‌ఎఫ్ కాలనీ, పులిమడుగు గ్రామాల్లో ఆదివారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని సిబ్బందితో కలసి చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పంటలపై ఆగని 'గజ' దాడులు

–ఏనుగుల కట్టడికి చర్యలు శూన్యం



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌బీఓ రవికుమార్

పెద్దపంజాణి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ఏనుగుల నుంచి రక్షణ లేకుండా పోతోందని రైతులు గగ్గోలు పెడుతున్నా సంబంధిత అధికారులు ఏ చర్యలూ తీసుకోవడం లేదు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె, పెనుగొలకల, పెద్దకాపల్లె, ముదిరెడ్డిపల్లె, బందార్లపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్, ఆకులవారిపల్లె, బేరుపల్లె, రాగిమాకులపల్లె, లింగమనాయునిపల్లె, గొడమాకులపల్లె, కమ్మపాళ్యం, గంకొండ తదితర గ్రామాలు అటవీ సరిహద్దులు కలిగి ఉన్నాయి. తరచూ ఏదో ఒక గ్రామంలో పంటలను ఏనుగులు నాశనం చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇదే కోవలో ఆదివారం వేకువ జామున పుంగనూరు రేంజ్ పేటూరు ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు తిప్పిరెడ్డిపల్లెకు చెందిన నాగరత్నమ్మ, భాస్కర్ రెడ్డి, మార్కొండా రెడ్డి తదితరుల మామిడి తోటలపై పడ్డాయి. మామిడి కొమ్మలను విరిచేసి సుమారు ఒక టన్ను కవర్లు కట్టిన బేనీషా మామిడి కాయలను ఆరగించేశాయి. నీలం, తోతాపురి కాయలను నేలరాల్చేశాయి. ఈ దాడుల్లో దాదాపు రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఉదయం తోటల వద్దకు వెళ్లిన ఏనుగుల కలిగించిన నష్టం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతుల సమాచారంతో రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు.

మామిడి తోటపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీలో ఏనుగుల గుంపు ఆదివారం తెల్ల వారుజామున మామిడి తోటల్లో పడి పంటను, చెట్లను ధ్వంసం చేశాయి. ఉదయం కాయలు కోసేందుకు కూలీలతో ట్రాక్టర్లలో వెళ్లిన వారికి ఏనుగుల కలిగించిన పంట నష్టం వెలుగులోకి వచ్చింది. జూపల్లెకు చెందిన రైతు మునస్వామి తోటలో ప్రవేశించిన ఏనుగులు కాయలు తినేశాయి. కొమ్మలను విరిచేశాయి. మండలంలోనే తిష్ట వేసిన ఏనుగులు ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట పంటలకు నష్టం కలిగించడం పరిపాటిగా మారడంతో రైతన్నలకు కంటికి కునుకు కరువైంది. వీటి కట్టడికి అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని మండిపడుతున్నారు.



ఏనుగులు దాడిలో దెబ్బతిన్న మామిడి తోట


పీ-ఫోర్.. ప్రజలు పరార్

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సర్వేలు చేయించడం, సంక్షేమ పథకాలకు కోత పెట్టడం పరిపాటిగా మారింది. ఈసారి పీ–4 పేరుతోసర్వేలు చేయిస్తోంది. రాబోయే రోజుల్లో పింఛన్ల నుంచి రుణాల వరకూ అన్నీ కోతలు పెట్టేందుకు ఇప్పటినుంచే పకడ్బందీగా కార్యాచరణ మొదలుపెట్టింది. సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ పంపి వివరాలు సేకరించే పనిలో ఉంది. అయితే ప్రజలు వీరికి సహకరించకపోవడంతో ఇష్టానుసారంగా వివరాలు నమోదు చేస్తున్నారన్న చర్చ మొదలైంది. దీంతో ఈ తప్పుడు వివరాలు తీసుకుని ప్రభుత్వం ఏం చేస్తుందో అనే ఆందోళనతో ప్రజల్లో మొదలైంది.

- ప్రజలను పరేషాన్ చేస్తున్న పీ–4 సర్వే
- వ్యక్తిగత సమాచారం సైతం యాప్‌లో నమోదు
- సర్వేతో ప్రజలను వెంటాడుతున్న భయం



దుకాణంలో పీ-4 సర్వే చేస్తున్న సిబ్బంది



ఐరాల: మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సర్వేకు పూనుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 90 శాతం పీ–4 సర్వే పూర్తయినట్లు సమాచారం. ఇంతకీ సర్వే ఎలా సాగిందని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎన్నో కొత్త విషయాలు వెలుగుచూశాయి.

'హలో..! ఏమండీ..మీకు ఎంతమంది పిల్లలు..? ఏమి చదువుకున్నారు..? మీ పిల్లలు ఇక్కడ ఉన్నారా.. లేక విదేశాల్లో ఉన్నారా..? మీ ఇంట్లో టీవీ ఉందా.. ఏసీ ఉందా.. ఫ్రిజ్ ఉందా.. కారు ఉందా.. స్కూటర్ ఉందా..? మీరు ప్రైవేటు ఉద్యోగమా.. లేక ప్రభుత్వ ఉద్యోగమా..? మీకు నెలకు ఎంత జీతం..? మీరు ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నారా..? ఇలా ఊపిరాడకుండా ప్రశ్నలతో పీ–4 సర్వే పేరిట సిబ్బంది ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ఏ పథకాలు తీసేస్తుందనే ఆలోచనతో భయాందోళన చెందుతున్నారు. దీంతో సర్వే చేయడానికి వచ్చిన సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వకుండా అరకొర వివరాలు చెప్పేసి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. టార్గెట్ పూర్తి చేయలేక సర్వే సిబ్బంది మిగతా వివరాలను ఇష్టానుసారంగా నమోదు చేస్తున్నారు.

ప్రజల్లో గుబులు

ఎన్నికల సమయంలో ఊకదంపుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు తీరా గద్దె నెక్కిన తరువాత ఏదో మొక్కుబడి ఒకటీ అరా ఇచ్చి చేతులు దులిపేసుకుంది. హామీలు నెరవేర్చకపోగా సర్వేల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తుండడం ప్రజల్ని మరింత గుబులుకు గురి చేస్తోంది. పీ–4 సర్వే ప్రభుత్వ పథకాలు అమలు కోసమా.. లేక ప్రభుత్వ పథకాలు కోత వేసేందుకా? అని తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకులు బాగుపడుతాయని నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అడుగడుగునా మోసం చేస్తున్నారనే భావన ప్రజలకు కలుగుతోంది. కూటమి నేతలు సన్నాయి నొక్కులతో ప్రజలకు ప్రభుత్వంపై విరక్తి కలుగుతుంది.

లబ్ధిదారుల గుండెల్లో దడ

పీ–4 సర్వే భాగంగా సిబ్బంది 27 రకాల వివరాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఫోన్‌కి ఓటీపీని కూడా పంపిస్తున్నారు. కాయకష్టం చేసుకుని జీవించే పేదలకు కాసేపు వినోదం కోసం అప్పులు చేసి టీవీ, సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తుంటారు. కుటుంబ అవసరాల కోసం బైక్‌ను కూడా కొంతమంది వినియోగిస్తున్నారు. ఇలా వివరాలన్నీ నమోదు చేయడంతో పీ–4 సర్వే సామాన్యులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది.

అపూర్వ సమ్మేళనం



యాదమరి: మూడు దశాబ్దాల క్రితం చదువుకున్న పాఠశాలలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల్లో 140 మంది కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా సంతోషంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు బాబాసాహెబ్, చెన్న కేశవులు, గోవింద పిళ్లై, జయరాం రెడ్డి, పద్మావతి, భాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ దాదాపు రూ.20 వేల విలువ చేసే నీటి శుద్ధి యంత్ర రక్షణకు అవసరమయ్యే గ్రిల్ నిర్మాణానికి పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.